

జనరంజక పాలనకు జనం జేజేలు

వైఎస్సార్ సీపీ జనరంజక పాలనకు జనం జేజేలు పలుకుతున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. - 8లో..



వేగంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు ఒలింపిక్ డే రన్

ఒంగోలు: ఒలింపిక్ డే రన్ కార్యక్రమం శుక్రవారం ప్రకాశం భవనం వద్ద ప్రారంభమవుతుందని ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, బొద్దు సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభిస్తారని, పరుగు స్థానిక మినీ స్టేడియం వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటు 600 మంది క్రీడాకారులు కూడా హాజరవుతారని, నగరంలోని క్రీడాభిమానులు కూడా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ఇంటర్మీయెట్‌లో మెరుగైన ఫలితాలు సాధించేలా అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన అందించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఏపీ మోడల్ స్కూళ్లు, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ, ఏపీ సోషల్ వెల్ఫేర్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 78 కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో బుధవారం ప్రకాశం భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ 80 శాతానికి తగ్గకుండా ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రవేశాలు పూర్తి కాగానే బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల స్థాయిని గుర్తించాలన్నారు. దాని ప్రకారం బోధన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. బోధన తీరును పర్యవేక్షించేందుకు అన్నీ యాజమాన్యాలతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతినెలా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి చర్చించిన అంశాలను తెలియచేయాలన్నారు. సమావేశంలో ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీవీఈఓ ఎస్‌వీ సుబ్బారావు, పాఠశాల విద్య సహాయ సంచాలకులు వాణీసురేఖ, సంక్షేమ కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ డీ జయ, కేజీబీవీ కో ఆర్డినేటర్ మాధవి పాల్గొన్నారు.

యువ ఉత్సవ్ ఇండియా ఎట్ 2047 బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు: యువ ఉత్సవ్ ఇండియా ఎట్ 2047 కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక క్విస్ కాలేజీలో బుధవారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ యువతలో నైపుణ్యాల పెంపునకు కేంద్రం అనేక పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. ఇందులో భాగంగా యువ ఉత్సవ్ పేరిట కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, గిద్దలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్, కుప్పా రంగనాయకులు, సరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి, నెహ్రూ యువకేంద్ర జిల్లా కోఆర్డినేటర్ కమల్‌సా తదితరులు పాల్గొన్నారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

హోం నుంచి పారిపోయిన యువతి

ఒంగోలు టౌన్: నగరంలోని స్వధార గృహంలో ఉంటున్న ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యుద్దనపుడి మండలం యనమదల గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి ఒక అబ్బాయిని ప్రేమించింది. కులాలు వేరు కావడంతో ఆమె తల్లిదండ్రులు వీరి వివాహానికి అంగీకరించలేదు. పైగా అబ్బాయి వయసు కూడా వివాహానికి సరిపోక పోవడంతో పెద్దలు అయిష్టత వ్యక్తం చేశారు. ఈ విషయంలో తల్లిదండ్రులు తనను వేధిస్తున్నారని 2022 నవంబరులో యుద్దనపూడి పోలీసు స్టేషన్లో యువతి ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆమెను ఒంగోలు భాగ్యనగర్‌లోని స్వధార గృహానికి తరలించారు. అప్పటి నుంచి హోంలో ఉంటున్న యువతి ఒంగోలులోని ఒక షాపులో పనిచేస్తోంది. గతవారం ఆ యువతి తల్లిదండ్రులు హోం వద్దకు వచ్చి గొడవ చేసి వెళ్లారు. సోమవారం ఆమె పనిచేసే షాపు వద్దకు వెళ్లి యాజమానిని తిట్టి గొడవ చేయడంతో ఆ యువతిని ఉద్యోగం నుంచి తీసేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆ యువతి హోంలో కనిపించలేదు. తెలిసిన చోటల్లా వెదికినా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి ఆమెకు, ఆమె ప్రియుడికి ఫోన్ చేయగా వారిద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. దాంతో తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.







యోగాసనాలు వేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, మేయర్ గంగాడ సుజాత తదితరులు



యోగాసనంతో అబ్బురపరిచిన చిన్నారి



యోగా ప్రతి గడప చేరాలి

- ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి
- యోగాసనాలు వేసిన ఎంపీ మాగుంట, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ఒంగోలు టౌన్: యోగా మనిషి శ్వాస మీద ధ్యాసను పెంచి శారీరక, మానసిక ఆరోగ్యాన్నిస్తుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆయుష్ ఆధ్వర్యంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో స్థానిక బచ్చల బాలయ్య కల్యాణ మండపంలో బుధవారం 9వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ వందల ఏళ్ల క్రితమే మన భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ కోసం యోగ చేయడం ప్రారంభించారని తెలిపారు. మన దేశానికి చెందిన యోగాను నేడు యావత్ ప్రపంచం పాటిస్తోందన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశాభివృద్ధిలో పాలుపంచుకోగలరని చెప్పారు. వారసత్వంగా వచ్చిన యోగాను ప్రతి గడపకు చేరేలా చేయాలని పిలుపునిచ్చారు. కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు ప్రతిరోజూ యోగ సాధన చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన నేటి ఆధునిక సమాజంలో ప్రశాంత జీవనానికి యోగా అత్యుత్తమ మార్గమని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగాకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. యోగాతో దినచర్యను ప్రారంభిస్తే రోజంతా హుషారుగా ఉంటారని, క్రియాశీలకంగా వ్యవహరించగలుగుతారన్నారు. ఏకాగ్రత పెరగడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, పక్కన కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, మేయర్ గంగాడ

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ యోగ సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా నిత్య జీవితంలో మరింతగా రాణించడానికి మార్గం సులువవుతుందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ యోగాతో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, జిల్లా అధికారులతో పతంజలి యోగా కేంద్రం గురువు శ్రీనివాస్ యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో డీపీఓ నారాయణరెడ్డి, డీటీసీ సుశీల, డిప్యూటీ కలెక్టర్ నారదముని, ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరక్టర్ పద్మజాతి, సీనియర్ మెడికల్ అధికారులు భ్రమరాంబ, భీమ్‌నాథ్, ఉపాస్ వైద్యశాల డైరెక్టర్లు ఉమాపతి చౌదరి, ప్రకాశ్, అనీల్, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.



క్రికెట్ బెట్టింగ్.. ఇదో పెద్ద మాఫియా..బంతి బంతికీ..పరుగు పరుగుకూ..ఫోర్, సిక్సర్, వికెట్ ఇలా అన్ని స్థాయిల్లోనూ బెట్టింగ్‌కు పాల్పడుతోంది. బెట్టింగ్ రాయుళ్లు, నమ్మకస్తులు వాట్సాప్ గ్రూపులుగా ఏర్పడుతున్నారు. పందేలు కాస్తున్నారు. టాస్ వేసినప్పటి నుంచి మ్యాచ్ పూర్తయ్యే వరకూ ప్రతి నిమిషం ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. యువతతో పాటు చిరు వ్యాపారుల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల వరకూ అందర్నీ బెట్టింగులకు బానిసలను చేస్తోంది. గెలుపొందితే రాత్రికి రాత్రే లక్షాధికారులం అవుతామని భ్రమ పడుతున్నారు. చివరికి నిండా మునిగిపోతున్నారు. అప్పులపాలై మనస్తాపంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కొందరు ముఖం చూపించలేక కుటుంబాలను వదలి పరారవుతున్నారు. ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు దీనికి అద్దం పడుతున్నాయి.

బెట్టింగ్ మాఫియా కాటేస్తోంది..

- అమాయకుల జీవితాలతో చెలగాటం
- బెట్టింగ్ బారిన పడుతున్న ఉద్యోగులు
- నేరాలు చేసి జైలు పాలవుతున్న యువకులు
- అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్న వైనం
- ఆత్మహత్యలు పరిష్కారం కాదు–ఎస్పీ

ఒంగోలు టౌన్: ఒకప్పుడు మహా నగరాలు, పెద్ద పెద్ద పట్టణాలకు పరిమితమైన బెట్టింగ్ భూతం నేడు గ్రామ స్థాయికి చేరుకుంది. ఇది ప్రజల ప్రాణాలను హరిస్తోంది. యువకులు, విద్యార్థులు క్రికెట్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలుగా మారి భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారు. తలిదండ్రుల ఆశల్ని, కలల్ని కల్లలు చేస్తున్నారు. బెట్టింగ్ భూతం బారినుంచి బయట పడలేక కొందరు యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మరికొందరు నేరాలు చేసి చెరసాల పాలవుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఒంగోలు ఆర్టీసీ డిపోలో ఒక మహిళ బస్సు కోసం వేచి ఉన్న సమయంలో ఓ యువకుడు ఆమె మెడలోని చైన్ లాక్కొని పారిపోయాడు. వెంటనే అప్రమమైన ఔట్‌పోస్టు పోలీసులు, అక్కడ ఉన్న ప్రయాణికుల సహకారంతో వెంటాడి అతడిని పట్టుకున్నారు. తీరా విచారిస్తే ఆ యువకుడు ఒంగోలులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నట్లు తెలిసి అక్కడివారంతా అవాక్కయ్యారు. కాలేజీ ఫీజు కట్టేందుకు తండ్రి ఇచ్చిన డబ్బులను బెట్టింగ్‌లో పోగొట్టుకొన్న సదరు యువకుడు దొంగతనానికి పాల్పడి జైలు పాలయ్యాడు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ఒంగోలులోని ఓ యువకుడిని కిడ్నాప్ చేయడం ఇటీవల తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇలాంటి ఘటనలు ఇటీవల నిత్యకృత్యమయ్యాయి. ప్రతిరోజూ పోలీసు స్టేషన్‌కు వచ్చే కేసుల్లో బెట్టింగ్ కేసు కనీసం ఒక్కటైనా ఉంటుందంటే అతిశయోక్తి కాదు. బెట్టింగ్ పుణ్యమా అని అనేక మంది యువకుల చదువులు కొండెక్కాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బలౌతున్న వారిలో ఎక్కువగా 20 నుంచి 30 ఏళ్ల వయసులోపు వారుండడం గమనార్హం.


విషాదం నింపిన బెట్టింగులు...

■ అతడి పేరు అంబటి మహాలింగం. ఒంగోలు విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మంచి ఉద్యోగం, సమాజంలో హోదా, నెల తిరిగే సరికల్లా చేతికి వచ్చే జీతం, అన్నిటికంటే అనురాగాన్ని పంచిచ్చే భార్యా బిడ్డలు ఉంచుకొని కూడా ఆయన చెడు స్నేహాలతో దారి తప్పాడు. క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులు తీర్చడానికి మళ్లీ అప్పులు చేశాడు. మళ్లీ బెట్టింగ్ కాశాడు. చివరికి అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

■ చీమకుర్తికి చెందిన మర్రిపూడి వెంకటేశ్వర్లు స్పెషల్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఒంగోలులోని యూనియన్ బ్యాంకు చెస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన తన సర్వీస్ గన్‌తో కాల్చుకొని మృతి చెందాడు. భార్యా భర్తల మధ్య కలహాలు రావడంతో ఏడాది క్రితం భార్య తన తల్లి ఇంటికి వెళ్లిపోగా వెంకటేశ్వర్లు చీమకుర్తిలో తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో విధులో ఉండగా తుపాకీతో కాల్చుకొని మరణించడం సంచలనం సృష్టించింది. అయితే బెట్టింగ్‌కు అలవాటు పడిన వెంకటేశ్వర్లు అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రచారం జరిగింది. ఈ ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వాళ్లే కావడం గమనార్హం.

తల్లిదండ్రులకు తెలియకుండా....

కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో విద్యా సంస్థలు ఆన్‌లైన్ పాఠాలు మొదలు పెట్టడంతో ప్రతి విద్యార్థి చేతికి సెల్ ఫోన్ వచ్చి చేరింది. దీంతో అనేక మంది యువతీ యువకులు అలవోకగా ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడిపోయారు. వర్క్ ఫ్రమ్ హోం ఉండడంతో చాలా మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం టైంపాస్‌గా ఆన్‌లైన్ గేములకు బానిసలయ్యారు. అయితే విద్యార్థులకు ఖాతాల్లో సరిపడా డబ్బులు ఉండవు కనుక తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌ల ద్వారా ఆటలు ఆడి తద్వారా నగదు బదిలీ చేయడం మొదలు పెట్టారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా బ్యాంకు ఖాతాల్లోంచి నగదు రెక్కలొచ్చి ఎగిరిపోయాక కానీ తల్లిదండ్రులు మేలుకోలేక పోయారు. అయినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బెట్టింగ్ మాయలో పడి పిల్లలు చేయిదాటి పోయారు.



ఆత్మహత్యలు పరిష్కారం కాదు

బెట్టింగ్‌ల వలన నష్టపోయిన వాళ్లు ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరం. కుటుంబ సభ్యుల గురించి ఆలోచించకుండా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడడం వలన సమస్య పరిష్కారం కాదు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఏదైనా సమస్య వచ్చినప్పుడు కుటుంబ సభ్యులతో చర్చించాలి. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలి. పోలీసు కంట్రోల్ రూంకి ఫోన్ చేసినా చాలు మీకు పోలీసుల సహకారం లభిస్తుంది. అసలు ఆన్‌లైన్ గేమింగ్‌లను సరదాగా కూడా ఆడడం మొదలు పెట్టకూడదు. సరదా మొదలైన ఆట బెట్టింగ్ వరకు తీసుకొని పోతుంది.

– ఎస్పీ మలికా గర్గ్

24 మంది తహశీల్దార్లకు పోస్టింగ్‌లు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: అడహక్ తహశీల్దార్లకు పదోన్నతి కల్పిస్తూ ఇటీవల సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దానిలో భాగంగా జిల్లాకు కేటాయించిన తహశీల్దార్లకు పోస్టింగ్‌లు కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్‌లు పొందిన తహశీల్దార్ల వివరాలివీ..

డిప్యూటీ తహశీల్దార్ పేరు	తహశీల్దార్‌గా కేటాయించిన పోస్టింగ్
ఎస్‌డీ అబ్దుల్ హమీద్, నెల్లూరు జిల్లా	తహశీల్దార్, తర్లుపాడు
ఏ వేణుగోపాలరావు, తహశీల్దార్, దోర్నాల (అడహక్)	తహశీల్దార్, దోర్నాల
బి.రమాదేవి, అడహక్ తహశీల్దారు, కొమరోలు	తహశీల్దార్, కొమరోలు
బీఆర్ఎల్‌వీ ప్రసాదరావు, పీసీపల్లి అడహక్ తహశీల్దార్	తహశీల్దార్, కొనకనమిట్ల
ఎం సువర్ణ, ఆర్ఎస్‌డీటీ, తర్లుపాడు	తహశీల్దార్, దొనకొండ
జీ రజనీకుమారి, అడహక్ తహశీల్దార్, మద్దిపాడు	తహశీల్దార్, మద్దిపాడు
సీహెచ్ కృష్ణారావు, పీఎస్‌పీవీ, ఒంగోలు	తహశీల్దార్, మర్రిపూడి
పి.బాలాజి విశ్వనాథ్, కలెక్టరేట్, ఒంగోలు	డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, మార్కాపురం
డి.శ్రావణ్‌కుమార్, చీమకుర్తి	స్పెషల్ తహశీల్దార్, ల్యాండ్ రీఫామ్స్, ఒంగోలు
ఎం నిరంజన్, నెల్లూరు జిల్లా	తహశీల్దార్, వెలిగండ్ల
ఎం సుజన్‌కుమార్, గుంటూరు జిల్లా	తహశీల్దార్, నాగులుప్పలపాడు
సాన శ్రీనివాసరెడ్డి, నెల్లూరు	తహశీల్దార్, మార్కాపురం
ఆవుల సురేష్, నెల్లూరు	తహశీల్దార్, పామూరు
బసిరెడ్డి జయవర్ధన్, నెల్లూరు	డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, కనిగిరి
మామిళ్లపల్లి శ్రావణ్‌కుమార్, పొన్నలూరు	తహశీల్దార్, పొన్నలూరు
సీహెచ్ అశోక్‌కుమార్ రెడ్డి, పొదిలి	తహశీల్దార్, పొదిలి
కర్నాటి రవీంద్రారెడ్డి, యర్రగొండపాలెం	తహశీల్దార్, యర్రగొండపాలెం
కే ప్రవీణ్‌కుమార్, కేకే మిట్ల	తహశీల్దార్, పీసీపల్లి
వెంకటకృష్ణారెడ్డి, పెద్దారవీడు	తహశీల్దార్, పెద్దారవీడు
ఎస్ఎల్ నారాయణరెడ్డి, కందుకూరు	తహశీల్దార్, సంతనూతలపాడు
పీ ఉమారాణి, కేఆర్‌సీసీ, ఒంగోలు	తహశీల్దార్, అర్ధవీడు
డీ సీతారామయ్య, స్పెషల్ తహశీల్దార్, ఒంగోలు	తహశీల్దార్, గిద్దలూరు
డీవీబీ వరకుమార్, తర్లుపాడు	తహశీల్దార్, బేస్తవారిపేట
కే విజయకుమారి, గిద్దలూరు	కేఆర్‌సీసీ స్పెషల్ తహశీల్దార్, ఆర్డీవో ఆఫీస్, ఒంగోలు

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



పుచ్చకాయలపల్లెలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- రూ.79.30 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ భవనాల ప్రారంభం

పెద్దారవీడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలో పుచ్చకాయలపల్లె గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించి రైతు భరోసా కేంద్రం భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ని మంత్రి బుధవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించడమే కాకుండా ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నామని వివరించారు. జగనన్న వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు ఇంటి వద్దనే పారదర్శక పాలన అందించి పేదల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. రైతు భరోసా కేంద్రాలు రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి చిరునామాగా, దిక్సూచిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంలో వలంటీర్లతో పాటు గృహ సారథులు, గ్రామ కన్వీనర్ల పాత్ర కీలకమని అన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రాల రామలక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఏఓ బుజ్జిబాయి, నాయకులు వజ్రాల ఆదినారాయణరెడ్డి, మారంరెడ్డి కృష్ణారెడ్డి, రామస్వామిరెడ్డి, పంది గురవయ్య, సొంటి నాగార్జునరెడ్డి, ఒద్దుల లక్ష్మిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ' ధమాల్

- జనం లేక అర్ధంతరంగా ముగిసిన టీడీపీ బహిరంగ సభ
- మినీ మేనిఫెస్టో చదివిన వెంటనే కుర్చీలు ఖాళీ

కొత్తపట్నం: తెలుగుదేశం పార్టీ ఆర్భాటపు ప్రచారంతో మొదలు పెట్టిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' చైతన్య రథ యాత్ర తొలిరోజు జనం రాక తుస్సుమంది. మండలంలోని మత్స్యకార గ్రామమైన కె.పల్లెపాలెంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు సైతం రాకపోవడంతో సభ వెలవెలబోయింది. దీంతో మొక్కుబడిగా మేనిఫెస్టో చదివి మమ అనిపించారు. బుధవారం ఉదయం టీడీపీ నాయకులంతా బస్సులో కొత్తపట్నం వైపు బయలు దేరారు. గత తెలుగుదేశ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా చింతల వద్ద మొదలు పెట్టి ఆపేసిన టిడ్కో ఇళ్ల వద్ద నాయకులంతా సెల్ఫీలు దిగారు. అనంతరం ఒంగోలు నగరంలో సమీకరణ చేసిన వారితో ర్యాలీగా నల్లూరు గార్డెన్స్ వద్దకు చేరుకున్నారు. అక్కడ భోజనాలు చేసి విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు కె.పల్లెపాలెంలో సభ నిర్వహించాల్సి ఉంది. అయితే 7 గంటలకు నాయకులు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, కొండపి ఎమ్మెల్యే డోల బాలవీరాంజనేయ స్వామి, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సభకు 1,000 మంది వస్తారని టీడీపీ నాయకులు అంచనా వేసి కుర్చీలు వేశారు. అయితే పట్టుమని 500 మంది కూడా రాలేదు.వచ్చిన వారు కూడా నాయకుల ప్రసంగాల మధ్యలోనే వెనుదిరిగారు. దీంతో స్టేజీమీదకు పిలిచిన నాయకులతో కూడా మాట్లాడించకుండా అర్ధంతంగా ముగించారు. మేనిఫెస్టోలో పెట్టిన పథకాలు చదివిన తరువాత వచ్చిన అరకొర జనంలో కూడా మూడొంతుల మంది వెళ్లిపోయారు. వెళ్లే జనాన్ని కార్యకర్తలు అదుపు చేసినా వారి వల్ల కాలేదు. దీంతో ప్రసంగాలు ఆపేశారు. పక్క జిల్లా నుంచి వచ్చిన నాయకులతో వేదిక నిండిపోగా..జనం రాక ప్రాంగణంలో ఒకవైపు ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడం కొసమెరుపు.



సభలో ఓ వైపు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కార్యకర్తల్లో అసంతృప్తి

మొదటి నుంచి పార్టీకి నిబద్ధతగా ఉన్న నాయకులను వేదిక మీదకు పిలవకపోవడంతో కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరిలో తెలుగు యువత మండల అధ్యక్షుడు దేవప్రభాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు ద్వారపాకుల శ్రీనివాసరెడ్డిలను సన్మానించేందుకు వేదిక మీదకు పిలిచినా అసంతృప్తితో వారు వెళ్లలేదు. ఫ్లెక్సీలలో కూడా కొందరు నాయకుల పేర్లు లేకపోవడంతో పార్టీ నాయకులపై వారు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కుష్టు వ్యాధిగ్రస్తులను పక్కాగా గుర్తించాలి

ఒంగోలు అర్బన్: కుష్టు వ్యాధిగ్రస్తులను పక్కాగా గుర్తించాలని లెప్రసీ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. బుధవారం కుష్టు వ్యాధి నిర్మూలన కార్యాలయంలో వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఇంటినీ సందర్శించి అనుమానితులను గుర్తించి చికిత్స ప్రారంభించాలని స్పష్టం చేశారు. డెర్మటాలజీ వైద్యుడు బాలాజీ నాయక్, అదనపు జిల్లా వైద్యాధికారి మాధవీలత, పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బస్సుల తనిఖీ

● ఫిట్‌నెస్ లేని ఒక బస్సు సీజ్



విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్

ఒంగోలు: ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులను ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ నుంచి పల్లామల్లికి వెళ్లే మార్గంలో పాఠశాలలు, కాలేజీ బస్సుల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవర్ల లైసెన్స్‌లను పరిశీలించారు. బస్సుల్లో సీటింగ్‌కు సరిపడా విద్యార్థులను తరలిస్తున్నారా లేదా అని తరచిచూశారు. బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఒక బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడంతో సీజ్ చేసి మద్దిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్పీ అంకితా సురానా, సీఐ భీమానాయక్

మార్కాపురం: విద్యుదాఘాతానికి గురై విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం మార్కాపురం మండలంలోని మాల్యవంతునిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన దొడ్డా లక్ష్మీరెడ్డి(14) బుధవారం ఉదయం తన ఇంటి ముందున్న విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లి అక్కడున్న తీగను కట్‌చేసే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. విద్యార్థి 9వ తరగతి చదువుతున్నాడు. సంఘటనా స్థలాన్ని ట్రైనీ ఎస్పీ అంకితా సురానా, సీఐ భీమానాయక్, రూరల్ ఎస్సై సుమన్ పరిశీలించి తల్లిదండ్రులను ఓదార్చారు.

యువకుడి వేధింపులపై వివాహిత ఫిర్యాదు

ఒంగోలు టౌన్: వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్న తనను ప్రేమిస్తున్నానంటూ ఇస్లాంపేటకు చెందిన యువకుడు వెంటపడి వేధిస్తున్నాడని ఓ మహిళ ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలు నగరంలోని మామిడిపాలేనికి చెందిన మహిళ కొన్నాళ్ల క్రితం కుటుంబంతో కలిసి ఇస్లాంపేటలో నివాసం ఉంది. అప్పుడు ఆ ఇంటి వెనక పోర్షన్లో షేక్ జాఫర్ అనే యువకుడి కుటుంబం నివాసం ఉండేది. కొద్దిరోజుల తర్వాత ఆ మహిళను ప్రేమిస్తున్నానంటూ జాఫర్ వేధించడం మొదలుపెట్టాడు. ఒంటరిగా బజారుకు వెళ్లే సమయంలో కాపు కాచి వెంటపడేవాడు. ఎన్నిసార్లు వారించినా వినకపోయే సరికి శ్రావణి ఆ ఇల్లు ఖాళీ చేసి సత్యనారాయణపురం వెళ్లిపోయింది. జాఫర్ అక్కడికి కూడా వచ్చి వేధించసాగాడు. దాంతో ఆ ఇల్లు కూడా ఖాళీ చేసి మామిడిపాలెంలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం ఆమె ఇంటికి వెళ్లిన జాఫర్.. 'నీ భర్త వచ్చాక మాట్లాడి వెళ్తా, గొడవ చేస్తే చంపేస్తా' అని బెదిరించాడు. దీంతో ఆమె భయంతో అలాగే ఉండిపోయింది. సాయంత్రం జాఫర్ తల్లి, బంధువులు ఆమె ఇంటికి వచ్చి దాడి చేశారు. చుట్టుపక్కలవారు రావడంతో వెళ్లిపోయారు. గాయపడిన మహిళను ఆమె భర్త జీజీహెచ్‌లో చేర్చి చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అతివేగానికి బాలుడు బలి!

దొనకొండ: బైక్ అదుపు తప్పడంతో ఓ బాలుడు మృతి చెందగా, మరో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దొనకొండ మండలం బాదాపురం వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన ఈర్ల బాల వెంకటేశ్వర్లు(15) దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. హాస్టల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవడం కోసం స్వగ్రామం నుంచి బైక్‌పై దొనకొండ వెళ్లాడు. పని పూర్తయిన అనంతరం స్వగ్రామానికి వెళ్లే క్రమంలో చందవరం గ్రామానికి చెందిన స్నేహితుడు వెంకట లక్ష్మణ్‌ను బైక్‌పై ఎక్కించుకున్నాడు. వేగంగా వెళ్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే గోతిలో పడింది. బాలవెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా వెనక కూర్చున్న లక్ష్మణ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వెంకట లక్ష్మణ్‌ను మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

ఆసనం @ ఆరోగ్యం





ఎస్పీ మలికాగర్గ్ యోగాసనాలు



ఒంగోలు : బచ్చల బాలయ్య కల్యాణ మండపంలో ఆసనాలు సాధన చేస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ ప్రైవేట్ సంస్థలు, పని ప్రదేశాల్లో యోగాసనాల ప్రాముఖ్యత, నిత్య యోగా సాధనతో కలిగే ప్రయోజనాల గురించి శిక్షకులు వివరించారు. పని ఒత్తిడి, నిద్రలేమి, రక్తపోటు, ఊబకాయం, మానసిక రుగ్మతలను దూరం చేసే శక్తి యోగాకు ఉందని విశదీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



సింగరాయకొండ: ఊళ్లపాలెంలో యోగా చేస్తున్న కూలీలు



యోగాభివాదం : కలెక్టర్, ఎంపీ, ఒంగోలు మేయర్‌తో కలిసి నమస్కరిస్తున్న విద్యార్థులు



ఒంగోలులో యోగా సాధకులకు ప్రశంస పత్రాలు అందజేసిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట



సంతనూతలపాడు వద్ద ట్రిపుల్ ఐటీ కళాశాలలో..



కొనకనమిట్ల : గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్లో..

జనరంజక పాలనకు జనం జేజేలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

● రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

● పుచ్చకాయలపల్లెలో వర్షంలోనే గడప గడపకు..

పెద్దారవీడు: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంతో గడప గడపలో జనం జేజేలు పలుకుతున్నారని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామంలో బుధవారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని, సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలకుడు మంచి వ్యక్తి అయితే ప్రకృతి, భగవంతుడు సహకరిస్తారనే విషయం సీఎం జగనన్న పాలనతో మరోసారి రుజువైందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత టీడీపీ పాలనకు, సీఎం జగనన్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు చంద్రబాబు అండ్ కో అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నారని, మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజలను మోసగించేందుకు మరోసారి సిద్ధమవుతున్నారని చెప్పారు. మీరు నాపై చూపించే ప్రేమాభిమానాలు మర్చిపోలేనివని, మీ అండే నాకు కొండంత బలమని ప్రజలనుద్దేశించి అన్నారు. అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా లబ్ధి దారుల ఖాతాలోనే నగదు జమ చేస్తుంటే ప్రతిపక్షాల కడుపు ఎందుకు మండిపోతోందో అర్థం కావడం లేదని విమర్శించారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని, మీ మంచి కోరి ఆర్థికంగా ఎదగడానికి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నను ఎప్పటికీ మరచిపోవద్దని కోరారు. పార్టీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో సొంత నిధులతో గ్రామానికి చెందిన దివ్యాంగులు దూదేకుల కాశింపీరాకు మంత్రి చేతుల మీదుగా వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రాల రామలక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఏపీఓ సాంబశివుడు, ఏపీఎం శ్రీనివాసులు, విద్యుత్, హౌసింగ్ శాఖ ఏఈలు రమేష్, శ్రావ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ దూదేకుల కాశయ్య, సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు వజ్రాల ఆదిరెడ్డి, మారంరెడ్డి రామస్వామిరెడ్డి, కృష్ణారెడ్డి, పందిగురవయ్య, సొంటి నాగార్జునరెడ్డి, ఒద్దుల లక్ష్మీరెడ్డి, తోకల ఆవులయ్యయాదవ్, వెన్నా శివకృష్ణారెడ్డి, ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైపాలెం సీహెచ్‌సీలో లక్ష్యానికి మించి సేవలు

● అభినందించిన నేషనల్ ముస్కాన్ టీం



వైద్యులకు సూచనలిస్తున్న నేషనల్ ముస్కాన్ టీం సభ్యుడు ప్రదీప్ శ్రీవాత్సవ

యర్రగొండపాలెం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం ముస్కాన్ టీం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నేషనల్ టీంకు చెందిన డాక్టర్ ప్రదీప్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. వైద్యశాలలో లక్ష్యానికి మించి సేవలు అందిస్తున్నారని, ఇదే విధానాన్ని కొనసాగించాలని సూచించారు. నవజాత శిశువుల విషయంలో వైద్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని, తల్లి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్యశాలలో మూడు నెలలకు సరిపడా మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. శిశువుల బెడ్లను 5 నుంచి 10కి పెంచుకోవాలని, టీకాలు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఒకవేళ శిశువు ఆరోగ్యం విషమిస్తే.. పరిస్థితిని తల్లిదండ్రులకు వివరించి, మెరుగైన వైద్యం కోసం అన్ని సౌకర్యాలు ఉన్న వైద్యశాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రోగులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. జాతీయ ముస్కాన్ టీం సభ్యురాలు డాక్టర్ సుప్రియ చౌదరి, రాష్ట్ర టీం సభ్యురాలు డాక్టర్ జ్యోతిరెడ్డి, జిల్లా టీం సభ్యుడు మురళీకృష్ణప్రసాద్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

వేగంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

● కలెక్టర్ దినేష్‌కుమార్



పరిశ్రమల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: పరిశ్రమలకు ప్రోత్సాహకాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ప్రకాశం భవనంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. అర్హత ఉన్న పరిశ్రమలకు సుమారు రూ.11 కోట్ల ప్రోత్సాహకాలు రావాల్సి ఉందని కలెక్టర్‌కు అధికారులు వివరించగా నివేదిక ఇవ్వాలని తెలిపారు. సింగిల్ విండో క్లియరెన్స్‌లను కూడా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. గ్రానైట్, మిర్చి క్లస్టర్లకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రావాల్సిన యంత్రాలను త్వరగా తెప్పించేలా పర్యవేక్షించాలని చెప్పారు. జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిడుగుల వాన

● ఓ వ్యక్తితోపాటు 2 గేదెలు, ఒక మేక మృతి

● నాగంబొట్లపాలెంలో షాక్‌కు గురైన దంపతులు



దర్శిలో మృతి చెందిన గేదెలు



త్రిపురాంతకం : పిడుగుపాటుకు మృతి చెందిన వెంకటేశ్వర్లు

త్రిపురాంతకం/తాళ్లూరు/దర్శి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లవాండ్లపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లు(45) గొర్రెలు మేపుతూ పొలంలో ఉండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెంలో పిడుగు పడటంతో సంపతు నాగరాజు జీవాల మందలో ఒక మేకపోతు మృతి చెందింది. నాగరాజు దంపతులతోపాటు 15 జీవాలు షాక్‌కు గురయ్యాయి. తృటిలో ప్రాణాపాయం తప్పడంతో నాగరాజు దంపతులు ఊపిరి పీల్చుకున్నారు.

దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివాజీ నగర్ శివారులో పిడుగు పడి రెండు గేదెలు మృతి చెందడంతో రైతు గంగిరెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

ఆటో బోల్తా.. 10 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు

కనిగిరి రూరల్: ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో 10 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కనిగిరి మండలంలోని అజీస్‌పురం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని శంఖవరం ఎస్సీ కాలనీకి చెందిన వారు కూలీ పనులకు పీసీపల్లి మండలం బట్టుపల్లికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కనిగిరి మండలం అజీస్‌పురం సమీపంలో లారీని ఓవర్ టేక్ చేయబోయి ఆటో తిరగబడింది. ప్రమాదంలో కోటమ్మ, జయమ్మకు తీవ్రంగా, మరో 8 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షత గాత్రులను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి ప్రసాద్ తెలిపారు.

వెబ్‌సైట్‌లో దివ్యాంగుల తుది మెరిట్ జాబితా

ఒంగోలు: జిల్లాలో 2020–21 విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగుల) ప్రత్యేక ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా గ్రూప్–4, సాంకేతిక పోస్టుల అభ్యర్థుల తుది మెరిట్ జాబితాను ఆ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన బుధవారం విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మెరిట్ జాబితాను 3 రోజుల వరకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ప్రకాశం.ఏపీ.జీవోవీ.ఇన్/నోటీసెస్ ట్యాబ్‌లోని రిక్రూట్‌మెంట్ ఫోల్డర్‌లో ఉంచనున్నట్లు చెప్పారు.